క్లుప్తంగా

పిన్‌కోడ్ నంబర్ మార్పు

మహబూబాబాద్: మానుకోట పట్టణంలోని కొత్తబజార్ పిన్‌కోడ్ 506101 బదులుగా 506102 ఉపయోగించాలని తపాలా శాఖ మానుకోట సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎండీ నయిముద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సాంకేతిక మార్పుల వల్ల ఉత్తరాల డెలివరీ జాప్యం జరుగకుండా పిన్‌కోడ్ మార్పు చేసినట్లు తెలిపారు. పాతబజార్ పిన్‌కోడ్‌లో ఎలాంటి మార్పు లేదన్నారు.

అవార్డుతో మరింత బాధ్యత



మహబూబాబాద్: అవార్డుతో బాధ్యత మరింత పెరుగుతుందని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సివిల్ సర్జన్, ఆర్‌ఎంఓగా పని చేస్తున్న డాక్టర్ జగదీశ్వర్‌కు ఐఆర్‌సీఎస్ మెడికల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. కాగా బుధవారం టీజీఓ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో జగదీశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, సోమ్లా, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అండగా స్వచ్ఛంద సంస్థ

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన సంపెట కావ్య తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. పెద్దనాన్న యాదయ్య సంరక్షణలో ఉంటూ చదువు కొనసాగిస్తుంది. ప్రభుత్వ మిషన్ వాత్సల్య ద్వారా లబ్ధి పొందుతున్న కావ్యకు 18 సంవత్సరాలు పూర్తికావడంతో వాత్సల్య లబ్ధి ఆగిపోయింది. దీంతో స్పందించిన మనూస్ స్వచ్ఛంద సంస్థ కావ్యను బుధవారం హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో డిగ్రీలో చేర్పించారు. మూడు సంవత్సరాలపాటు ఫీజు అందిస్తామని సంస్థ భరోసా ఇచ్చింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి లకేష్, మహేష్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో చేరండి

కురవి: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో చేరాలని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ అలువాల కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్‌మీడియట్ కోర్సును ఒకే ఏడాదిలో పూర్తి చేసేందుకు అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 31న చివరి తేదీ అని తెలిపారు. చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 98852 14380 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్, వీరభద్ర డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, శాంతికుమార్, శ్రీకాంత్, దేవేందర్, శివవర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా ఎదగాలి

డోర్నకల్: విద్యార్థులు మానసికంగా ఎదిగేలా శిక్షణ ఇచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని ప్రముఖ విద్యావేత్త జి.గోపాలకృష్ణ కోరారు. స్థానిక పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం పిల్లల హృదయాలను వికసింపజేద్దాం పేరుతో నిర్వహించిన సెమినార్‌లో గోపాలకృష్ణ మాట్లాడారు. అనంతరం స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మానాయక్, హెచ్‌ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు మంజులత, శంకర్, రాంనాయక్ పాల్గొన్నారు.

డైరీల పంపిణీ

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, ఎస్సై రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టై, బెల్టుల..

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో టై, బెల్ట్, నోట్‌బుక్స్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి పంపిణీ చేశారు.

23న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట వేస్తున్నామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి బుధవారం తెలిపారు.

అలంకారప్రాయం..

- ప్రారంభానికి నోచుకోని నూతన జీపీ భవనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రారంభించని జీపీ భవనం

చిన్నగూడూరు: పల్లెలు, తండాల్లో పాలనా సౌలభ్యం కోసం 500 జనాభా ఉన్న తండాలు, మారుమూల గ్రామాలను గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, నూతన జీపీ భవనాలను నిర్మించింది. కానీ కొన్ని జీపీ భవనాలు ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని మేగ్యాతండాలో ఎస్టీ ఎస్‌డీఎఫ్(గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం, ఏటూరునాగారం) నుంచి రూ.20లక్షల నిధులతో నూతన జీపీ భవన నిర్మాణ పనులను 2023లో అప్పటి డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రారంభించారు. ఈ భవనం పూర్తయి ఏండ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారని స్థానికుల్లో చర్చ కొనసాగుతుంది. గతంలో కొనసాగిన అంగన్‌వాడీ కేంద్రం పాత భవనంలోనే పంచాయతీ విధులు నిర్వహిస్తోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతుంది. అరకొర వసతులతో అద్దె భవనంలో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా పాత పంచాయతీ భవనంలో సరైన వసతులు లేక స్థానిక తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కొత్త జీపీ భవనం ప్రారంభం కాలేదంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన పంచాయతీ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని మేగ్యాతండావాసులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



మేగ్యాతండాల్లో నూతనంగా నిర్మాణం పూర్తయిన జీపీ భవనాన్ని సత్వరమే వినియోగంలోకి తేవాలి. అన్నిహంగులతో సిద్ధంగా ఉన్న భవనాన్ని ప్రారంభించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. పలుమార్లు మండల, జిల్లా అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పంచాయతీ భవనాన్ని ప్రారంభించాలి.

- బాదావత్ సురేష్, మేగ్యాతండా

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



చెక్కులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

కురవి: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా పని చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బతికితేనే పేదలు బతుకుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బతికించుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పింఛన్ డబ్బులు పెంచుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ వీరాబాబు, ఏడీఈ రమేశ్, ఏఈ శారద, కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, చైర్మన్‌లు గార్లపాటి వెంకటరెడ్డి, కొర్ను రవీందర్‌రెడ్డి, నాయకులు రజనీకాంత్, వేణుగోపాల్‌రెడ్డి, రామునాయక్ అనిల్ పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వినతిపత్రం ఇస్తున్న జీఎంపీఎస్ నాయకులు

మహబూబాబాద్: జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా అన్నిరకాల మందులు పంపిణీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్లం అశోక్ డిమాండ్ చేశారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పశువైద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రధానంగా నట్టల మందులు, వ్యాక్సిన్‌లు ఉచితంగా పంపిణీ చేసి, మూగజీవాల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, కుమార్, అశోక్, రాకేష్, శ్రీను, దామెదర్, రఘు, రాజు, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

డోర్నకల్: బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో బుధవారం వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో సర్పంచులు లేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గ్రామాల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, గణేష్‌నాయక్, దేవానాయక్, సత్యనారాయణ, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామంలో మూడు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం చిలుకోడు గ్రామానికి చెందిన మంద గోపయ్య కుటుంబ సభ్యులు ఈనెల 12న తిరుపతి వెళ్లగా మంద రామారావు, మందా నర్సింహారావు ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ మూడు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మందా గోనయ్య ఇంట్లో 4.7తులాల బంగారు, 10తులాల వెండి ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీకి గురి కాగా, మిగతా ఇళ్లలో వస్తువుల చోరీ జరగలేదు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

- పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత



మాట్లాడుతున్న మాలోతు కవిత

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు కార్యకర్తలు సైనికుల్లా సిద్ధం కావాలని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్టారెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రపు పథకాలను అమలు చేస్తూ, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను నమ్మించాలని చూస్తుందని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ పాలన, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఖాసీం, వీరన్న, సంపత్‌రావు, సురేందర్, వెంకన్న, నర్సింహానాయక్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొత్తగూడ: మండలంలోని కార్లాయి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్వో వజర హత్ తెలిపారు.

పెద్దవంగర: మండలంలోని పోచారం గ్రామ పరిధిలోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. దొంగరి సంతోష్, నాలి యాకన్న, అంగోతు చందులాల్, మాలోతు వెంకన్న, బొడక నరేష్‌లు డ్రైవర్లు కాగా దొంగరి కళమ్మ, అంగోతు అంబాలి, బానోతు రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బంధం చెరువు నుంచి జగన్నాయకుల చెరువుకాలువ (అనంతారం వెళ్లే దారిలో గల) ను పూడ్చివేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. బంధం చెరువు నుంచి జగన్నాయకుల చెరువు కాలువను ఎరసవడ్ల వెంకటేశ్వర్లు, తోట శివశంకర్, మరికొంతమంది వ్యక్తులు పూడ్చివేయగా నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుండపునేని శ్రావణి ఫిర్యాదు చేశారన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: ఇల్లెందులో మంత్రుల ఆధ్వర్యంలో నేడు నిర్వహించే కొత్తరేషన్ కార్డుల పంపిణీ, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు బుధవారం కోరారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ రవీందర్ రావు



ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న క్రాంతికుమార్

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయం లాభసాటిగా ఉండే విధంగా రైతుల అభ్యున్నతికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఎమ్మెల్సీ బుధవారం సందర్శించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఈప్రాంతంలో కేవీకే, జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ఏర్పాటు చేసేందుకు కోట్ల రూపాయల విలువ గల భూమిని ప్రభుత్వానికి అందజేసి సహకరించిన జెన్నారెడ్డి రఘోత్తంరెడ్డి సేవలను కొనియాడారు. కేవీకే, జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ సమస్యలను యూనివర్సిటీలు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మల్యాల కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.క్రాంతికుమార్, శాస్త్రవేత్తలు కె.నాగరాజు, ప్రశాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మార్నేని వెంకన్న, మహబూబ్ పాషా, తేళ్ల శ్రీనివాస్, మార్నేని రఘు, అవుల వెంకన, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగాల చట్టం తీసుకురావాలి



దీక్షలో పాల్గొన్న తుడుందెబ్బ నాయకులు

గూడూరు: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఆదివాసులకు కల్పించిన హక్కులను పాలకులు అమలు చేయాలని, ఏజెన్సీ ఉద్యోగాల చట్టం తయారు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య అధ్వర్యంలో ఏజెన్సీ ఉద్యోగాల చట్టం డిమాండ్‌తో ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసి, ఏజెన్సీ ఉద్యోగాల చట్టంపై అసెంబ్లీలో మంత్రి మండలి తీర్మానం చేసి గవర్నర్‌కు పంపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టెం ముఖర్జీ, భాస్కర్, లింగాల కిరణ్, పడిగె నాగేశ్వర్‌రావు, వజ్రయ్య, మల్లేష్, కిరణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



పెద్దవంగర: డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెద్దవంగర: మండల కేంద్రంలోని సీఆర్పీగా పని చేస్తున్న సంతోష్ సతీమణి మేముల ఝాన్సీ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు రూ.లక్షా 75వేలు సంతోష్ కుమార్తె అబుదామిని పేరిట బుధవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను ఎంఈఓ బుధవారపు శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సోమారపు ఐలయ్య, వెలిదె సురేష్, ఎర్ర వెంకన్న, చిక్కాల సతీష్, మధుసూదన్ రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల చేయూత

కురవి: మండల కేంద్రానికి చెందిన నిమ్మనగోటి శ్రీనివాస్ తమ్ముడు వీరన్న మూడురోజుల క్రితం మృతి చెందాడు. ఈ మేరకు మహబూబాబాద్ డిగ్రీ కాలేజీలో 1989–1992లో చదువుకున్న పూర్వ విద్యార్థులు(శ్రీనివాస్ మిత్ర బృందం) రూ.10వేల ఆర్థికసాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు మల్లం నవీన్, బజ్జూరు వెంకటరెడ్డి, తోట శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాస్, కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి, విజయ్, విశ్వం పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

పెద్దవంగర: పురుగుల మందు తాగి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన గుంటల అమృత(42) వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. భర్త అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. నాటి నుంచి మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. జీవితంపై విరక్తితో రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించంగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికు కుమారుడు సాయికుమార్, కుమార్తె భవాని ఉన్నారు. అమృత తండ్రి ముక్కావుల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

దంతాలపల్లి: మండలంలో రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని జాలుబావుల గ్రామానికి చెందిన దండ సురేష్ సొంత పని కోసం ద్విచక్రవాహనంపై దాట్ల గ్రామం వైపు వెళ్తున్నాడు. దాట్ల గ్రామానికి చెందిన కోడి సురేష్ రేపోని గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో దాట్ల, జాలుబావుల గ్రామాల మధ్య రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఇద్దరికి తలలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఇద్దరిని 108 వాహనంలో హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

సదస్సును జయప్రదం చేయండి

నెల్లికుదురు సెంటర్: ఈనెల 26వ తేదీన వరంగల్‌లో జరగనున్న ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లాస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సంఘం జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీను, రాధా, సుధా, బాబు, సమ్మయ్య పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 301లోని 29ఎకరాల ప్రభుత్వ గుట్ట భూమిని కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్య తీసుకోవాని గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమికి సర్వేయర్ ద్వారా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జెట్టి రాములు, కొప్పుల గోపి, బల్లెం మహేష్ పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

కొత్తగూడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బంగారి ఆదిలక్ష్మి సూచించారు. పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూ భాగ్యమ్మ, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

కురవి: రైతులు నానో యూరియాను వాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నరసింహరావు సూచించారు. బుధవారం మండలంలోని సూదనపల్లిలోని రైతువేదికలో నానో యూరియా, నానో డీఏపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకన్న, ఏఈఓ దేవా, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన నవిల హుస్సేన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాంగ్రెస్ నాయకుడు బొడ్డు వెంకన్న బాధిత కుటుంబానికి రూ.2,500 నగదుతోపాటు 50కిలోల బియ్యాన్ని బుధవారం అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు పెద్ద వెంకన్న, మద్దోజు వెంకన్న, ధనమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్లో డే

మహబూబాబాద్: పిల్లలకు రంగులపై అవగాహన కల్పించడానికే ఎల్లో డే కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ గుండు సులోచన అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఎల్లో డే నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీలు శైలజ, వినోద, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పాలనను కోరుతున్నారు..



గూడూరు: గ్రామాల్లో ప్రజలంతా నాటి ఇందిరమ్మ పాలనను కోరుతున్నారని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, రాసమల్ల యాకయ్య, ఎండి రసూల్, మార్కెట్ డైరెక్టర్ సమ్మెట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కేసముద్రం: విద్యుత్‌తీగలకు తాకి విద్యుత్‌షాక్‌కు గురై గేదే మృతి చెందిన సంఘటన మండలంలోని గాంధీపురంజీపీలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్య దేవా అనే రైతుకు చెందిన గేదెలను ఎప్పటిలాగే మేతమేపేందుకు ఊరి చివరకు తీసుకెళ్లాడు. అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతిచెందింది. రూ.50వేల నష్టపోయినట్లు భాదిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పాలప్యాకెట్ల వ్యాను బోల్తా

నెల్లికుదురు: నకిరేకల్ నుంచి వీఎస్‌ఆర్ పాల ప్యాకెట్లను లోడు చేసుకుని మహబూబాబాద్‌కు వెళ్తున్న వ్యాను బ్రాహ్మణకొత్తపల్లి చెరువు కట్టపై ప్రమాదవశాత్తు బుధవారం బోల్తాపడింది. డ్రైవర్ ప్రవీన్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వైద్యశిబిరం

తొర్రూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన వికాస స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మద్దెల రమా కోరారు. బుధవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి వారి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది రాధాకృష్ణ, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులు రమేష్‌చందర్, సరిత, ప్రమీల, ధనలక్ష్మి, పద్మ పాల్గొన్నారు..

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో బుధవారం టీబీ ముక్త్ భారత్‌అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. టీబీ నిర్ధారణ వైద్య పరీక్షలతోపాటు ఇతర పరిక్షలు నిర్వహించారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలి



మహబూబాబాద్: నారాయణపురం రైతులకు ఎన్నికల లోపుపట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని మాజీ ఎంపీటీసీ రవి, నాయకులు బీమా, వీరన్న అన్నారు. కేసముద్రం మండలం నారాయణపురం రైతులు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో రైతులు లచ్చు, లకుపతి, వెంకన్న, రవి, భాస్కర్, రమేష్, రాంజీ, రవీందర్, చందు పాల్గొన్నారు.

'సస్పెండ్ చేసే అధికారం లేదు'

తొర్రూరు: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం పనిచేసే తమకు ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేసే అధికారం కాంగ్రెస్ మండల నాయకులకు లేదని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మేరుగు మల్లేశంగౌడ్, నాయకులు జాటోతు బాలునాయక్, చిట్టిమళ్ల మహేష్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు దేవరకొండ శ్రీనివాస్, తమడపల్లి సంపత్, ముత్యం అన్వేష్, పంజాల శంకర్, పానుగంటి మనోహర్ పాల్గొన్నారు..

స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న ఐలయ్య

గార్ల: ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. బుధవారం గార్లలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఏఐకేఎంఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాలోత్ మాన్యా, ప్రధాన కార్యదర్శిగా గౌని మల్లేష్, పీఓడబ్ల్యూ మండల అధ్యక్షురాలిగా మారుతి సైదమ్మ, ప్రధాన కార్యదర్శిగా గోళ్ల సుజాత, పీవైఎల్ మండల అధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా కుసిని బాబూరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు ఐలయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సక్రు, భద్రయ్య పాల్గొన్నారు.